

అందంగా.. ఆకర్షణీయంగా..

విశాఖ నగరాన్ని అందంగా.. ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. 8లో



21 నుంచి ఓటరు సర్వే

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఎన్నికల అధికారులను ఆదేశించారు. 8లో

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక రైలు

పుణ్యక్షేత్రాలు, ఆలయాల సందర్శనకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు ప్యాకేజీలను ప్రకటించింది. మొదటిసారిగా అయోధ్య వంటి ప్రాంతాలను కూడా ఈ టూర్‌లో సందర్శించే అవకాశం కల్పిస్తోంది. 8లో

న్యూస్‌రీల్

'జగనన్న సురక్ష'తో 1.68 లక్షల ధ్రువపత్రాల జారీ

దొండపర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 1.68 లక్షల ధ్రువపత్రాలను ఆయా లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 440 సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపుల్ని నిర్వహించామనీ.. ఇంకా 167 సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల 27 వరకు సురక్ష కార్యక్రమం జరగనుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4.91 లక్షల కుటుంబాలకు గాను 3.38 లక్షల కుటుంబాలకు సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. మొత్తం 94,492 వినతులు రాగా.. 83,100 వినతులను అప్పటికప్పుడే పరిష్కృతం చేశామన్నారు. ఇప్పటివరకు 45,054 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్, 24,767 ఇన్‌కమ్ సర్టిఫికెట్స్, 4,139 జనన ధ్రువపత్రాలు, 1019 డెత్ సర్టిఫికెట్స్, ఇతర ధ్రువపత్రాలు 8,121 వరకు జారీ చేశామన్నారు. మిగిలిన ప్రాంత ప్రజలు సైతం సురక్ష క్యాంపుల్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కేజీహెచ్‌లో ఆరోగ్యశ్రీకి ప్రాధాన్యం



విభాగాధిపతులతో సమీక్షిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు మెరుగుపరచాలని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ కోరారు. ఆరోగ్యశ్రీపై విభాగాధిపతులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తున్న సేవలు, శస్త్ర చికిత్సల సంఖ్య పెంచాలని సూచించారు. దీని ద్వారా కేజీహెచ్‌కు ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ జూన్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా రూ. నాలుగు కోట్ల ఆదాయం లభించిందని, ఆదాయం పెరిగితే ఆస్పత్రి అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణన్, ఎ.పద్మజ, పలువురు విభాగాధిపతులు, ఆర్‌ఎంవోలు, ఇతర సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

'తానా' ఫౌండేషన్ ట్రస్టీగా సతీష్



మహారాణిపేట: అమెరికాలోని ప్రతిష్టాత్మక 'తానా' ఫౌండేషన్ ట్రస్టీగా సతీష్ మేకా నియమితులయ్యారు. నాలుగేళ్ల పాటు ఆయన ఆ పదవిలో ఉంటారు. ఈ పదవికి ఎంపిక చేసిన తానా బోర్డు అఫ్ డైరెక్టర్స్‌తో పాటు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సతీష్ ఈ సందర్భంగా ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సతీష్ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల మెరుగైన చదువు కోసం 25కు పైగా డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేశారు. క్యాన్సర్ నివారణ, అవగాహనపై బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి , గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్‌తో కలిసి వందకు పైగా వైద్య శిబిరాలు నిర్వహించారు. సతీష్ పదోతరగతి వరకూ విశాఖలోని జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ,డిగ్రీ ,పీజీ విశాఖలోనే చదువుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం అమెరికా వెళ్లి స్థిరపడ్డారు.

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

రేపటి నుంచి ప్రత్యేక తనిఖీలు

గోపాలపట్నం: జిల్లాలో తిరిగే ప్రతి వాహనం హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాన్సీ నంబర్ ప్లేట్ వాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రూ.1000 జరిమానాతో పాటు వాహనాలను కూడా సీజ్ చేస్తామన్నారు. ఎవరైనా తమ వాహనాలకు ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు అమర్చితే వెంటనే మార్చుకోవాలని సూచించారు. దీనిపై ఈ నెల 20 నుంచి ప్రత్యేక తనిఖీలు చేపడతామన్నారు.

నేడు ఏఎంసీ శతాబ్ది కార్యక్రమాలు

మహారాణిపేట: ఆంధ్రా వైద్య కళాశాల వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటలకు ఆర్.కె.బీచ్‌రోడ్డులో బీచ్‌వాక్, ఫ్లాష్ మాబ్, హెల్త్ చెకప్, ఆస్పత్రిలో మార్చ్‌పాస్ట్, పతాక ఆవిష్కరణ, 100 మంది వైద్య విద్యార్థుల రక్తదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ ప్రిన్సిపాల్ ఎ.బుచ్చిరాజు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఏఎంసీ మాజీ ప్రిన్సిపాళ్లు డాక్టర్ జి.నిర్మల, డాక్టర్ శశిప్రభలను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహా మాల్



యూనిటీ మాల్ నమూనా

ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఉత్పత్తులన్నీ ఒకే చోట లభించేలా సరికొత్త మాల్ మహానగరంలో ఏర్పాటు కానుంది. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ జియోగ్రాఫికల్ ఇండికేషన్(జీఐ) పొందిన ఉత్పత్తుల కోసం వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ పేరుతో ఈ మాల్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రుషికొండ సమీపంలో బీచ్‌రోడ్డులో యూనిటీ మాల్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. టెండర్లు ఖరారైన 24 నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. – సాక్షి, విశాఖపట్నం

- రుషికొండ సమీపంలో యూనిటీ మాల్ ఏర్పాటుకు సన్నాహాలు
- వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ పేరుతో ప్రత్యేక ఉత్పత్తుల ప్రదర్శన
- రాష్ట్రానికి రూ.180 కోట్ల రుణం అందించనున్న కేంద్రం

కేంద్ర బడ్జెట్–2023 సందర్భంగా 'యూనిటీ మాల్'అనే ప్రాజెక్ట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఒక్కొక్క రాష్ట్రంలోని ప్రత్యేకమైన హస్తకళ ఉత్పత్తులు, వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్, భౌగోళిక గుర్తింపు(జీఐ ఇండెక్స్) పొందిన ఉత్పత్తులను ప్రోత్సహించడం, విక్రయించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆయా రాష్ట్రాలు స్థలాన్ని గుర్తిస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు అందించి.. ఈ మాల్ నిర్మించేందుకు సహకారం అందిస్తుంది. ప్రతి రాష్ట్రంలోనూ ఆ రాష్ట్ర రాజధాని లేదా ఆర్థిక రాజధాని, లేదా ప్రసిద్ధమైన పర్యాటక ప్రాంతంలో ఈ యూనిటీ మాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రుషికొండలోని రామానాయుడు స్టూడియో సమీపంలో యూనిటీ మాల్ ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతంగా జిల్లా అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

యూనిటీ మాల్ అంటే.?

ఆయా రాష్ట్రాల్లో ఉత్పత్తి చేసిన విభిన్న శ్రేణి హస్తకళ ఉత్పత్తులు, ఇతర సాంస్కృతిక కళాఖండాలను ప్రోత్సహించడం, విక్రయించడం లక్ష్యంగా నిర్దేశించుకున్న కార్యక్రమం యూనిటీ మాల్. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన హస్తకళలు, చేతి వృత్తులు, జీఐ ఇండెక్స్ ఉత్పత్తులను దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు పరిచయం చేసేందుకు అనువుగా దీన్ని నిర్మించనున్నారు. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.180 కోట్ల రుణాన్ని మంజూరు చేస్తుంది. 50 నెలల పాటు రుణంపై వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేకుండా అందిస్తుంది. టెండర్లు ఖరారైన తర్వాత 24 నుంచి 36 నెలల్లో యూనిటీ మాల్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

రాష్ట్రంలో జీఐ గుర్తింపు పొందినవివే...

సహజ, వ్యవసాయ ఉత్పత్తులు, హస్త కళలు, పారిశ్రామిక ఉత్పత్తులకు ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన 'ది జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఆఫ్ గూడ్స్'(రిజిస్ట్రేషన్, రక్షణ) చట్టం–1999 ఆధారంగా జీఐ గుర్తింపు ఇస్తుంది. 2003 సెప్టెంబర్ 15 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. 2004–2005లో 'డార్జిలింగ్ టీ'దేశంలో మొట్టమొదటి జీఐ ట్యాగ్ పొందింది. ఇప్పటి వరకు దాదాపు నాలుగు వందల ఉత్పత్తులకు జీఐ గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు పొందిన ఉత్పత్తులు, వస్తువులు, పదార్థాలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ గుర్తింపు 10 ఏళ్లు వర్తిస్తుంది. తర్వాత మళ్లీ పునరుద్ధరించుకోవచ్చు. రాష్ట్రంలో ఏటికొప్పాక బొమ్మలు, అరకు అరబికా కాఫీ, తిరుపతి లడ్డూ, బంగినపల్లి మామిడి, బొబ్బిలి వీణ, బందరు లడ్డూ, శ్రీకాళహస్తి కలంకారీ, కొండపల్లి కొయ్య బొమ్మలు, మచిలీపట్నం కలంకారీ, బుడితి గంటలు, కంచు బొమ్మలు, ఏపీ లెదర్ పప్పెట్రీ, ఉప్పాడ జందానీ చీరలు, గుంటూరు సన్నం మిర్చి, వెంకటగిరి చీరలు, మంగళగిరి చీరలు, ధర్మవరం పట్టుచీరలు, ఉదయగిరి చెక్క సామగ్రి, దుర్గి, ఆళ్లగడ్డ రాతిబొమ్మలు.. మొదలైనవి జీఐ గుర్తింపు పొందాయి. వీటితో పాటు ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వా, పొందూరు ఖద్దరు, పలు ప్రాంతాల పిండి వంటలు, హస్తకళలన్నీ యూనిటీ మాల్‌లో ఒకే చోట కొలువై ఉండనున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం



ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు యూనిటీమాల్ ఉపయుక్తంగా నిలుస్తుంది. స్థానిక కళాకారులు, వారి ఉత్పత్తులను విక్రయించి.. వారికి జీవనోపాధిని మెరుగు పరిచేందుకు దోహదపడుతుంది. ఆయా రాష్ట్రాల సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం గురించి ప్రజలు ఒకే చోట తెలుసుకోవచ్చు. యూనిటీ మాల్ ఏర్పాటు కోసం ఇప్పటికే స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. స్థల పరిశీలనకు బృందాలు రావాలని ఆహ్వానించాం. త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణ వెలువడే అవకాశం ఉంది.

– డా.మల్లికార్జున, కలెక్టర్

నేడే స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- 10 స్థానాలకు పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- బరిలో వైఎస్సార్ సీపీ నుంచి 10 మంది, టీడీపీ నుంచి 10 మంది..
- బలాబలాలు బట్టి వైఎస్సార్ సీపీదే పైచేయి



సూచనలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: మహా విశాఖ నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ(స్థాయీ సంఘం) ఎన్నిక బుధవారం జరగనుంది. కౌన్సిల్ హాలులో మేయర్ హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది. అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలను ప్రకటిస్తారు. స్టాండింగ్ కమిటీలో 10 స్థానాల కోసం వైఎస్సార్ సీపీ నుంచి 10 మంది, టీడీపీ నుంచి 10 మంది కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. జీవీఎంసీలో సింహభాగం వైఎస్సార్ సీపీ సభ్యులు ఉండడంతో అన్ని స్థానాలూ కైవసం చేసుకునే అవకాశం ఉంది. గెలుపు అవకాశాలు లేనప్పటికీ.. ఉనికి చాటుకునేందుకు తెలుగుదేశం తమ కార్పొరేటర్లను బరిలో దింపింది. జీవీఎంసీలో మొత్తం 98 సీట్లకు గాను వైఎస్సార్ సీపీ నుంచి 58 మంది కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. ముగ్గురు స్వతంత్రులు, ముగ్గురు టీడీపీకి చెందిన కార్పొరేటర్ల మద్దతు వైఎస్సార్ సీపీకి ఉంది. టీడీపీకి 26 మంది కార్పొరేటర్లుండగా, జనసేనకి ముగ్గురు కార్పొరేటర్లతో పాటు ఓ స్వతంత్ర అభ్యర్థి(కందుల నాగరాజు) బలం ఉంది. ఇక సీపీఐ, సీపీఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరు విజయం సాధించారు. 21వ వార్డు కార్పొరేటర్ వంశీకృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్సీగా నియమితులైన సంగతి తెలిసిందే. అక్కడ ఎన్నిక జరగాల్సి ఉంది.

ఒక్కో కార్పొరేటర్‌కు 10 ఓట్లు..

ఎమ్మెల్సీ ఎన్నిక మాదిరిగా స్థాయీ సంఘం ఎన్నికలు జరగనున్నాయి. అయితే ప్రాధాన్యత ఓట్లు అనేవి ఉండవు. ఒక్కో కార్పొరేటర్‌కు 10 ఓట్లు ఉంటాయి. ఒకే బ్యాలెట్ పేపర్‌పై వైఎస్సార్ సీపీ, టీడీపీ చెందిన 20 మంది అభ్యర్థుల పేర్లుంటాయి. వారికి నచ్చిన అభ్యర్థి పేరు ముందు టిక్ పెట్టి ఓటు వేయాలి. ఓ కార్పొరేటర్ ఒక అభ్యర్థికి ఒక ఓటు చొప్పున 10 మందికి 10 ఓట్లు వేయాల్సి ఉంటుంది. 11వ ఓటు వేస్తే చెల్లనదిగా పరిగణిస్తారు. 48 ఓట్లు వస్తే విజేతగా ప్రకటిస్తారు.

బరిలో నిలిచింది వీరే..

- వైఎస్సార్ సీపీ నుంచి అక్కరమాని పద్మ, గుడ్ల విజయసాయి, ఉరుకూటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, బల్లా లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, బట్టు సూర్యకుమారి, పీలా లక్ష్మీ సౌజన్య..
- టీడీపీ నుంచి గోడి విజయలక్ష్మి, నొల్లి నూకరత్న, పిసిని వరహా లక్ష్మీనరసింహ, పిల్లా మంగమ్మ, బల్ల శ్రీనివాసరావు, బొమ్మిడి రమణ, మద్దెల రామలక్ష్మీ, ముక్కా శ్రావణి, శరగడం రాజశేఖర్, గంధం శ్రీనివాసరావు బరిలో ఉన్నారు.

వామపక్షాలు ఓటింగ్‌కు దూరం

సీపీఎం నుంచి కార్పొరేటర్ గంగారాం, సీపీఐ నుంచి ఏజే స్టాలిన్ స్థాయీ సంఘ ఎన్నికలో పాల్గొనడం లేదని ఇప్పటికే ప్రకటించారు. జనసేన మంగళవారం రాత్రి వరకు ఓటింగ్‌లో పాల్గొనాలా? లేదా అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

మాక్ పోలింగ్

వైఎస్సార్ సీపీకి సంబంధించి మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశాలతో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కె.సతీష్ తదితరులు పాల్గొని కార్పొరేటర్లకు పలు సూచనలు చేశారు.

'మీతో ఆనంద్' యాప్ సీఎం జగన్ ఆవిష్కరణ



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఆనంద్‌కుమార్

గోపాలపట్నం : ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, వారి సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రత్యేకంగా రూపొందించిన 'మీతో ఆనంద్' అనే యాప్‌ను తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. సీఎం జగన్‌ను మంగళవారం ఆనంద్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను రూపొందించిన యాప్‌తోపాటు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను సీఎం జగన్‌కు వివరించారు. యాప్‌ను పరిశీలించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నం బాగుందని ప్రశంసించారని ఆనంద్‌కుమార్ తెలిపారు. మీతో ఆనంద్ యాప్‌ను ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ యాప్ ఉంటే ఆనంద్ మీతో ఉన్నట్లేనని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు ఇందులో అప్‌లోడ్ చేస్తే పరిష్కారమయ్యే వరకూ ఏ పరిస్థితిలో ఉందో ట్రాక్ చేసుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా పరిష్కారం కాని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఆనంద్ కుమార్ చెప్పారు.

డీసీసీబీ చైర్మన్‌గా కోలా గురువులు

విధేయతకు పట్టం



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కోలా గురువులు నియమితులయ్యారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు జిల్లాలకు డీసీసీబీ చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. మూడేళ్లుగా కొనసాగుతున్న ప్రస్తుత చైర్‌పర్సన్ చింతకాయల అనిత పదవీ కాలం ఇటీవల ముగిసింది. దీంతో ఆ స్థానంలో గురువులను నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో ఆరు నెలలు లేదా తదుపరి ఎన్నికలు జరిగే వరకు కొనసాగుతారని పేర్కొన్నారు. తొలుత 2008లో ప్రజారాజ్యం పార్టీతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన 2009 అసెంబ్లీ ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి 2014లో అదే నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి ఓటమి చెందారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా పార్టీ పటిష్టతకు కృషి చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2020లో గురువులు రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అప్పట్నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. కాగా మార్చిలో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. అయితే ఒక్క ఓటు తేడాతో ఆయన ఓటమి చెందారు. వివాద రహితునిగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి గురువులకు ప్రతిష్టాత్మక డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. విధేయతకు పట్టం కట్టింది.

చిరువ్యాపారుల మోములో చిరునవ్వు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జగనన్న తోడు చిరు వ్యాపారాల నమూనాలు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి, నాగిరెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

- వరుసగా ఏడో విడత 'జగనన్న తోడు' రుణసాయం
- జిల్లాలో 22,573 మందికి రూ.24.31 కోట్ల లబ్ధి
- సకాలంలో రుణం చెల్లించిన వారికి రూ.43.32 లక్షల వడ్డీ జమ

సాక్షి, విశాఖపట్నం : అధిక వడ్డీ భారం నుంచి చిరు వ్యాపారులను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకం ఎందరినో ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిందని కలెక్టర్ డా.మల్లికార్జున అన్నారు. జగనన్న తోడు పథకం ద్వారా ఏడో విడత రుణ సాయం చేసే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ రూమ్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర తదితరులు వీక్షించారు. అనంతరం విశాఖ జిల్లాకు సంబంధించి 22,573 మంది లబ్ధిదారులకు జగనన్న తోడు పథకం కింద రూ.24.31 కోట్ల రుణ సాయం లబ్ధికి సంబంధించిన చెక్కును లబ్ధిదారులకు అందించారు. అదే విధంగా జిల్లాలో రుణ సాయం సక్రమంగా చెల్లించిన 18,182 మందికి వడ్డీ మాఫీ కింద రూ.43.32 లక్షలు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జగనన్న తోడు 2022–23 ఆర్థిక సంవత్సరం ఫేస్–7 రుణాల పంపిణీ, లబ్ధిదారులకు వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో చెల్లించిన వారికి ఏటా మరో రూ.1,000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకూ వడ్డీలేని రుణాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పలనాగిరెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేసి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ ఈ పథకం వల్ల ఒకరి కింద పనిచేసే స్థాయి నుంచి సొంతంగా వ్యాపారం చేసుకొనే స్థాయికి ఎదగ గలరన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి అధికారి పూర్ణిమదేవి, బ్యాంక్ అధికారులు, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

కష్టకాలంలో ఆదుకున్నారన్నా...



జగనన్నా.. నమస్కారం. మీతో మాట్లాడే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు ఎప్పటికీ మర్చిపోలేను. కోవిడ్ సమయంలో కూలి పనులు లేక కుటుంబ పోషణ కష్టంగా మారింది. అలాంటి సమయంలో ఈ పథకం ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం మీరు అందించారన్నా. అదే మాకు కొండంత భరోసా ఇచ్చింది. ఇంటి దగ్గరే వ్యాపారం చేసుకుంటూ కుటుంబానికి ఆర్థిక భరోసాగా మారాను. మా పిల్లలకు అమ్మఒడి, విద్యాదీవెన అందుతోంది. జగనన్న సురక్ష ద్వారా మా పిల్లలకు అవసరమైన సర్టిఫికెట్స్ కూడా తీసుకున్నాం అన్నా. థాంక్యూ జగనన్నా.

– సీఎం జగన్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో తాడి అనురాధ, అల్లిపురం

'మీ తోడు'తో వ్యాపార వృద్ధి



ఒక మెషీన్ కొని చుట్టుపక్కల వారికి సంబంధించిన వస్త్రాలు కుడుతూ టైలరింగ్ చేసుకుంటున్నాను. జగనన్న తోడు ద్వారా వచ్చిన లబ్ధితో చిన్న షాపు అద్దెకు తీసుకొని వ్యాపారాన్ని మార్చాను. మొదటి విడతలో మెషీన్లు కొని షాపు విస్తరించాను. లాభసాటిగా మారింది. తర్వాత.. కేవలం కుట్టడమే కాకుండా.. టైలరింగ్ మెటీరియల్ కూడా విక్రయిస్తూ షాపు నడుపుతున్నాను. ఇదంతా సీఎం జగన్ అందించిన ఆర్థిక భరోసాయే కారణం. స్వయం సహాయక సభ్యురాలిగా కూడా రుణం అందుతోంది.

– కె.కల్యాణి, భీమిలి

మహిళను అడ్డం పెట్టుకుని చంద్రబాబు రాజకీయం

- అనిత తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి
- చంద్రబాబు, లోకేష్, పవన్ ఫ్లెక్సీని దహనం చేసిన వైఎస్సార్ సీపీ మహిళా నేతలు



చంద్రబాబు, పవన్, లోకేష్ ఫ్లెక్సీని చెప్పులతో కొడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు



ఫ్లెక్సీని దహనం చేస్తున్న మహిళా నేతలు

సీతమ్మధార: టీడీపీ నాయకురాలు అనిత చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ మహిళా నేతలు భగ్గుమన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ నేతలు ఆందోళన చేపట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ మహిళలను కించపరిచే సంస్కృతి వైఎస్సార్ సీపీలో లేదన్నారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కల్యాణి మాట్లాడుతూ మహిళలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేసే అనైతిక సంస్కృతి చంద్రబాబుదేనన్నారు. ఎన్టీఆర్‌ను పదవి నుంచి తప్పించే సమయంలో కూడా మహిళను అడ్డం పెట్టుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతమ్మను విమర్శిస్తే ఉపేక్షించేది లేదని అనితను హెచ్చరించారు. చంద్రబాబు దర్శకత్వంలోనే అనిత మాట్లాడుతున్నారని.. ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. కుళ్లు రాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబుకి, ఐటీడీపీ ద్వారా మహిళలను ట్రోల్స్ చేస్తున్న లోకేష్‌కి చెప్పులు చూపించాలని అనితకు హితవు పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ సీఎం జగన్ హయాంలో మహిళలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగిందన్నారు. సామాజిక వర్గాన్ని అడ్డం పెట్టుకుని అనిత రాజకీయం చేస్తే.. అన్ని వర్గాల నుంచి తిరుగుబాటు తప్పదన్నారు. జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి మాట్లాడుతూ తమ వద్ద కూడా చెప్పులు ఉన్నాయనే విషయం గుర్తు పెట్టుకోవాలని టీడీపీ నేతలను హెచ్చరించారు. కార్పొరేషన్ చైర్మన్లు చొక్కాకుల లక్ష్మి, మాధవి వర్మ, అనూష, రోజారాణి, ధనలత, శిరీషా, కార్పొరేటర్ శశికళ, నేతలు పేడాడ రమణి కుమారి, వరలక్ష్మి, బి.లక్ష్మి, గౌషియా, అమ్మాజీ, లలిత కుమారి, విజయలక్ష్మి, సుశీల, రమాదేవి, షాకినా, వెంకటలక్ష్మి, భాను, కాకి పద్మ, బంగారమ్మ, పరివిన్, జగదీశ్వరి, శ్రీదేవి, రమణి, ఉమా, మున్నీషా, డి.లక్ష్మి, సుగుణ పాల్గొన్నారు.

25న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 25న కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో 44 అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అంశాలు చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానమైనవి..

- నగరాన్ని పర్యావరణ హితంగా మార్చేందుకు ఎకో–వైజాగ్, ఎకో–ఫండ్, సొసైటీలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు అమలు చేసేందుకు మేయర్ ముందస్తు ఆమోదం, ధ్రువీకరణపై చర్చ సాగనుంది.
- జోన్–2 పరిధి 12వ వార్డు ఆరిలోవలోని సూర్యతేజానగర్, శ్రీకాంత్‌నగర్ జంక్షన్లను రూ.1.46కోట్లతో అభివృద్ధి..
- ప్రజారోగ్య విభాగంలో ఏర్పడిన 482 అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయడం..
- 2021–26 సంవత్సరాలకు అమృత్ 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వ విధి విధానాలు అనుసరించి.. అమృత్ 2.0 నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, యూఎల్‌బీ నిధులతో పలు పనులు మంజూరు..
- రూ.1.92 కోట్లతో సింహాచలం 1వ ఘాట్‌రోడ్డు నుంచి పాత గోశాల జంక్షన్ వరకు రోడ్డుకు తూర్పు వైపున వరద నీటి కాలువ నిర్మాణం..
- రూ.1.93 కోట్లతో జోన్–2 పరిధి 11వ వార్డు జీవీఎంసీ కల్యాణ మండపం(ఆరిలోవ దుర్గాలమ్మ గుడి) మొదటి, రెండవ అంతస్తు నిర్మాణం..
- జోన్–3 పరిధి 21వ వార్డు పాండురంగాపురంలో పాత షాపింగ్ కాంప్లెక్స్ స్థానంలో రూ.1.99 కోట్లతో జీవీఎంసీ ఆధునిక అతిథి గృహం నిర్మాణం..
- రూ.70 లక్షలతో అనకాపల్లి పట్టణం ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడాకారిణులకు డార్మిటరీ నిర్మాణం..
- మురుగు నీరు సముద్రంలోకి వెళ్లకుండా పలు బీచ్‌ల్లో తగిన చర్యలు చేపట్టడం..
- జోన్–3 పరిధి ఆర్కే బీచ్ జంక్షన్ నుంచి కైలాసగిరి రోప్‌వే వరకు రూ.1.86 కోట్లతో ల్యాండ్ స్కేప్ సెంట్రల్ మీడియన్‌కు ఎంఎస్ గ్రిల్స్ అమర్చడం..
- జోన్–8 పరిధి 92వ వార్డు వెంకటాపురం మూడు ఆలయాల కూడలి నుంచి రైల్వే బ్రిడ్జి వరకు ఎల్‌జీ పాలీమర్స్ ప్రహరీ ఆనుకుని వరద నీటి కాలువ నిర్మాణానికి అదనపు మొత్తం మంజూరు..
- జోన్–5 పరిధి 41వ వార్డు కాన్వెంట్ జంక్షన్ కూడలి నుంచి జ్ఞానాపురం వద్ద ఫ్లైఓవర్ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు తారు, పిక్క మిశ్రంతో పునఃనిర్మాణంతో పాటు పరిపాలన, పబ్లిక్ వర్క్స్, పలు అభివృద్ధి పనుల ఆమోదానికి సభ్యులు చర్చించనున్నారు.

కిలిమంజారోపై 'కాశీ విశ్వనాథుడు'

సంకల్ప బలం ఉండాలే గానీ సాధించలేనిది ఏదీ ఉండదని రుజువు చేస్తున్నారు కొందరు వయోధికులు. ఏడున్నర పదుల వయసు దాటినా, చెక్కు చెదరని ఉత్సాహంతో పర్వతాలను సైతం అధిరోహించి ఎందరికో స్ఫూర్తినిస్తున్నారు. అలా 77 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతాల్లో రెండో స్థానంలో ఉన్న 'కిలిమంజారో'ను అధిరోహించి చిన్ననాటి నుంచి పర్వతారోహణ చేయాలన్న తన ఆకాంక్షను నెరవేర్చుకున్నారు. ఆయనే నగరానికి చెందిన వైమానిక దళ మాజీ అధికారి గండూరి కాశీ విశ్వనాథం.

- 77 ఏళ్ల వయసులో పర్వతారోహణ చేసిన నగరవాసి
- హార్ట్ పేషెంట్ అయినా.. వైద్యుల పర్యవేక్షణలో అధిరోహణ
- సంకల్పదీక్షతో నెరవేర్చుకున్న చిన్ననాటి ఆకాంక్ష



కిలిమంజారో పర్వతం గిల్‌మన్ పాయింట్ వద్ద భారత పతాకంతో గండూరి కాశీ విశ్వనాథం

మురళీనగర్(విశాఖ ఉత్తర): చూడటానికి సాదాసీదాగా కనిపిస్తున్న ఈ మాజీ వైమానిక దళ అధికారి గండూరి కాశీ విశ్వనాథం. ఎయిర్‌ఫోర్స్‌లో ఎన్నో సాహస కృత్యాల్లో పాల్గొని, రోజూ 12 కిలోమీటర్లు అవలీలగా నడిచేస్తూ, మారథాన్‌లలో పాల్గొనే ఈయనకు చిన్నప్పటి నుంచి ఓ కోరిక మాత్రం మిగిలిపోయింది. అదే పర్వతారోహణ. 77 ఏళ్ల వయసులో తన కోరికను నెరవేర్చుకునేందుకు పెద్ద సాహసాన్నే చేశారు. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే ఢీకొట్టాలన్నట్లు ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తయిన, ప్రపంచంలో ఎత్తయిన పర్వతాల్లో రెండో స్థానంలో ఉన్న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి అందరి దృష్టినీ ఆకర్షించారు. గుండె సంబంధిత వ్యాధితో రెండుసార్లు 2008, 2012లో స్టంట్‌లు వేసినా.. మనో నిబ్బరంతో పర్వతారోహణ చేసిన ఆయన విజయప్రస్థానమిదీ..

విశాఖలో ప్రాథమిక విద్యాభ్యాసం

నగరంలోని ఎంవీడీఎం హైస్కూల్లో టెన్త్ పాసై, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చేస్తుండగానే ఉద్యోగం రావడంతో 1965లో ఎయిర్‌ఫోర్స్‌లో చేరారు. బెంగళూరులోని జలాలీ ఇంజినీరింగ్ ఎయిర్‌ఫోర్స్ టెక్నికల్ కాలేజీలో ఇంజినీరింగ్ చేశారు. ఎయిర్‌మన్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి ఫ్లయిట్ గన్నర్‌గా మారారు. ఉత్తమ సేవలకుగాను 1985లో వాయుసేన మెడల్ పొందారు. 1987లో కమిషన్డ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. హెవీ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్ ఐఎల్–76లో ఏఎం(ఈ)ఏఐఆర్ గన్నరీ లీడర్‌గా చేశారు. చీఫ్ క్వాలిటీ ఎస్యూరెన్స్ ఆఫీసర్, కేస్‌బురా ఓవరాల్ ప్రాజెక్టు చీఫ్ క్వాలిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. వైమానికదళంలో స్క్వాడ్రన్ లీడర్‌గా ఆగ్రాలో పనిచేస్తూ జూలై 2003లో పదవీ విరమణ చేశారు. ఆయన జీవిత భాగస్వామి వెంకటరత్నం ఆగ్రాలో ఎయిర్‌ఫోర్స్ స్కూల్‌లో తాత్కాలిక ఉపాధ్యాయినిగా పని చేశారు.

పాకిస్థాన్ యుద్ధంలో పాల్గొని..

పాకిస్థాన్‌తో 1971లో జరిగిన యుద్ధంలో ఆర్మమెంట్ ఇన్‌చార్జిగా పని చేశారు విశ్వనాథం. 5వ అంటార్కిటికా సాహసయాత్ర బృందంలో వాయుసేనా దళం సభ్యుడిగా వెళ్లారు. సియాచిన్ గ్లేషియర్స్‌లో వాయుసేన తరఫున సైనికులకు లాజిస్టిక్ సపోర్టు సభ్యుడిగా పని చేయడం అత్యంత సాహసమైన దశగా ఆయన పేర్కొన్నారు. కార్నికోబార్ ఐలాండ్‌లో ఇందిరా పాయింట్‌కు వెళ్లిన మొట్టమొదటి సభ్యుడిగా గుర్తింపు పొందారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఆహార సరఫరా వింగ్‌లో పనిచేశారు. భారత ప్రధానులైన ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ, రాష్ట్రపతులు నీలం సంజీవరెడ్డి, జ్ఞాని జైల్‌సింగ్ భద్రతా సిబ్బందిలో వాయుసేన సిబ్బందిలో పని చేశారు. ఎయిర్‌ఫోర్స్ కమాండ్ ఎగ్జామినర్‌గా తన సేవలు అందించారు.

ఆకాంక్ష నెరవేరిందిలా..

ఆయన కుమారుడు శ్రీకాంత్ టాంజానియాలో నివసిస్తుండడంతో అక్కడికి వెళ్లిన విశ్వనాథం. కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాలనే తన కోరికను కుమారుడికి చెప్పారు. అయితే, ఆయన హార్ట్ పేషెంట్ కావడంతో కుటుంబసభ్యులు అభ్యంతరం తెలిపారు. కానీ ఆయన డాక్టర్లను సంప్రదించి కిలిమంజారో పర్వతారోహణ(5890మీటర్ల ఎత్తు)కు ఈ నెల 1వ తేదీన బయల్దేరారు. ఆయనతో పాటు కుమారుడు శ్రీకాంత్ (48), బంధువుల పిల్లలు ఆదిత్య (40), అరవింద్ (37), 15మంది కార్మికులు, ఇద్దరు గైడ్స్ తో ఉత్సాహంగా యాత్ర సాగించారు. 5వ తేదీన గిల్‌మన్ పాయింట్ (5685మీటర్ల ఎత్తు)కు చేరుకుని, తన ఆకాంక్షను నెరవేర్చుకున్నారు. మిగతా వారు వుహురూ శిఖరం వరకు వెళ్లారు.


పుస్తక పఠనం చేస్తూ..

ప్రశంసల వెల్లువ

77ఏడేళ్ల వయసులో కిలిమంజారో పర్వతం అధిరోహించిన కాశీవిశ్వనాథంకు ప్రశంసలు వెల్లువెత్తాయి. టాంజానియా ఆయనకు ప్రశంసా పత్రం అందించగా ఇండియన్ ఎంబసీ తన అధికార ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో ఆయనపై అభినందనల వర్షం కురిపించింది. గార్డియన్ పత్రిక ఆయన గురించి ప్రత్యేకంగా వ్యాసం ప్రచురించింది.

రోజూ 12కి.మీ నడుస్తాను

రోజూ 12 కిలోమీటర్లు నడుస్తాను. 14 అంతస్తుల భవనాన్ని అలసట లేకుండా ఎక్కగలను. లిఫ్ట్ వాడను. 4సార్లు అప్పన్న గిరి ప్రదక్షిణ చేశారు. 6గంటల్లో గిరి ప్రదక్షిణ పూర్తి చేయగలను. వైజాగ్‌లో 10కిలోమీటర్లు, ముంబయిలో మూడు మారథాన్లు, టాంజానియాలో ఒక మారథాన్‌లో పాల్గొన్నాను. ఉదయం 4గంటలకు నా దినచర్య ప్రారంభమవుతుంది. గంటసేపు తులసి పూజ, సాలగ్రామ అభిషేకం చేస్తాను. లలితా, విష్ణుసహస్రనామాలు చదువుతాను. జపం చేసుకుంటాను. భగవద్గీత పఠిస్తాను. నేను సంపూర్ణ శాకాహారిని.

– కాశీ విశ్వనాథం

21 నుంచి ఇంటింటా ఓటరు సర్వే

సాక్షి, విశాఖపట్నం: జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణలో మార్పులకు, చేర్పులకు సంబంధించిన డేటా పూర్తిస్థాయిలో, పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఎన్నికల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బందితో ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమం, ఓటరు జాబితా సవరణ–2024 అంశాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో ఎన్నికల అధికారులందరూ పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు సర్వే నిర్వహించేందుకు బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించిన వివరాలను బీఎల్‌వోలు సేకరిస్తారని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నవీకరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు చురుగ్గా జరగాలన్నారు. ఓటర్ల తొలగింపు చర్యల్లో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఫారం 13, 14 రూల్స్ తప్పక అనుసరించాలని ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. తొలగింపు చేసేముందు వ్యక్తిగతంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో 2023 జనవరి నాటికి 18,96,043 మంది ఓటర్లు ఉన్నారనీ.. ఫారం–6 ద్వారా 25,236 దరఖాస్తులు రాగా 18,981 పరిష్కారం చేసి నమోదు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్లకు అవగాహన కల్పించేందుకు 'యువ ఓటరు ప్రభంజనం' 'ఓటరుగా మీ సమస్య –మా పరిష్కారం' తదితర అవగాహన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో ఎస్ శ్రీనివాస మూర్తి , ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమీక్షలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది హాజరయ్యారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

దొండపర్తి: జిల్లాలో ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఫారం పెండెన్సీ, చేర్పులు, తొలగింపులు, జెండర్ రేషియో, ఎన్నికల జాబితా స్వచ్ఛత తదితర అంశాలపై సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని చెప్పారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగింపు ప్రక్రియ వివాద రహితంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందంగా.. ఆకర్షణీయంగా విశాఖ

డాబాగార్డెన్స్: సిరిపురంలోని దత్ ఐలాండ్ ప్రాంతంలో లైటింగ్, రీసైక్లింగ్ మెటీరియల్‌తో తయారు చేసిన కుర్చీలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్–3 పరిధి దత్ ఐలాండ్, ఆర్కే బీచ్‌లోని స్విమ్మింగ్ పూల్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించేలా జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజల సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆర్కే బీచ్‌లోని వాల్ పెయింటింగ్, స్విమ్మింగ్‌పూల్ ముందు రోడ్డు, ద్వీపాల అలంకరణ వంటి పనులు పక్షం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీర్లు(స్మార్ట్‌సిటీ) సుధాకర్, తాగునీటి విభాగాధికారి సుధాకర్ పాల్గొన్నారు.


దత్ ఐలాండ్ ప్రాంతాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

జాబ్‌చార్ట్ విడుదల చేయాలని డిమాండ్

మహారాణిపేట: పని భారం తగ్గించాలంటూ ఆశా వర్కర్స్ మంగళవారం రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ(డీఎంహెచ్‌వో) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జోరు వానలోనూ గొడుగులు వేసుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ ఆశాలకు వెంటనే జాబ్ చార్ట్ విడుదల చేయాలన్నారు. ప్రతి 1000 మంది జనాభాకు ఒక ఆశాను నియమించాలని, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రసూతి సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు చేయాలన్నారు. సచివాలయాల విధులను రద్దు చేయాలని కోరారు. రిజిస్ట్రర్‌లో రోజూ సంతకాలు చేసే పద్ధతిని నిలిపివేయాలన్నారు. పీహెచ్‌సీకి పిలిచిన ప్రతిసారి టీఏ, డీఏలు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రతి ఆశ కార్యకర్తకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జి.అప్పలరాజు, ఐద్వా సహాయ కార్యదర్శి వరలక్ష్మి, నాయకులు పి.మణి, ఎస్.పద్మ, వి.మేరీ, వై.సీతారత్నం, అనురాధ, ఆదిలక్ష్మి, అన్నపూర్ణ, భారతి, భాను, హేమలత, తదితరులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్స్

ఓబీసీ సాధనకు చలో ఢిల్లీ

బీచ్ రోడ్డు: శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేలా ఒత్తిడి తీసుకురావడం కోసం ఆ సంఘం నాయకులు చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు ఓబీసీ సాధన సమితి నాయకుడు ఎస్.గజపతిరావు ఆధ్వర్యంలో అఖిల భారత శిష్టకరణ సంఘం నాయకులు మంగళవారం ఢిల్లీ పయనమయ్యారు. ఇప్పటికే పలువురు రాజ్యసభ, లోకసభ సభ్యులకు వినతి పత్రాలు అందించిన సంఘ సభ్యులు.. పార్లమెంట్ వద్ద మిగతా ఎంపీలకు కూడా వినతులు అందజేయనున్నారు. అలాగే ఓబీసీ కమిటీ ముందు తమ వాదన వినిపించనున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.కె.మహంతి, ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.


ఢిల్లీ వెళ్తున్న శిష్టకరణ నాయకులు

సాగరతీరం సాక్షిగా..

- వేకువజామునే శ్రీరాములు బర్త్‌డే వేడుక
- 101వ ఏట అడుగిడిన వెటరన్ అథ్లెట్
- ఘనంగా సన్మానించిన వాకర్లు, డాక్టర్లు

సాక్షి, విశాఖపట్నం: నిండు నూరేళ్లు పూర్తి చేసుకుని 101వ ఏట అడుగిడిన వెటరన్ అథ్లెట్ వి.శ్రీరాములు పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. సాగరతీరంలోని ఆర్కే బీచ్‌లో వేకువజామున సాటి వాకర్లు, డాక్టర్లు, ప్రముఖులు శ్రీరాములుతో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు తినిపించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన బెలూన్లను ఎగురవేయించారు. హ్యాపీ బర్త్‌డే అంటూ శుభాకాంక్షలు చెప్పారు. వందేళ్లు నిండిన సందర్భంగా ఆయనకు జ్ఞాపికను బహూకరించారు. శాలువా కప్పి సత్కరించారు. బర్త్‌డే వేడుకలతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన వారందరికీ శ్రీరాములు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో డాక్టర్ పెద వీర్రాజు, కేవీ రావు, డీఎస్ వర్మ, వాకర్లు, డాక్టర్లు, శ్రీరాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మరోవైపు శ్రీరాములు గృహంలోనూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు 101వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.


బెలూన్లను ఎగురవేస్తున్న శ్రీరాములు

బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది రక్తదానం


రక్త దాతలను అభినందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ పదాన్

దొండపర్తి: బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ నెల 20వ తేదీన 116వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రీజియన్ పరిధిలో అన్ని బ్రాంచ్‌లలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.ఎం.పదాన్ తెలిపారు. మంగళవారం బ్యాంక్ రీజనల్ ఆఫీస్‌లో ఏఎస్‌రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రీజనల్ మేనేజర్ పదాన్ ప్రారంభించారు. ఇందులో 45 మంది బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 20వ తేదీ ఉదయం బీచ్ క్లీనింగ్, వాక్‌థాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

20న జనసేన పార్టీలో చేరుతా..

మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



సీతమ్మధార: విజయవాడలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈనెల 20వ తేదీన ఆ పార్టీలో చేరుతానని మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం సీతమ్మధారలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం సీతమ్మధారలోని తన నివాసం నుంచి కార్లు, బస్సుల్లో తన మద్దతుదారులతో ర్యాలీగా విజయవాడ బయలుదేరుతానని చెప్పారు. పెందుర్తిలో పోటీ చేసేందుకు జనసేన నుంచి ఎలాంటి హామీ తీసుకోలేదని అన్నారు. వైఎస్సార్ సీపీలో వ్యక్తిగత లబ్ధి కోసం ఏరోజు అడగలేదన్నారు. ఏ పార్టీలో ఉన్నా వ్యక్తిగత విమర్శలు చేయడానికి తాను దూరంగా ఉంటానన్నారు. అధినేత పవన్ కల్యాణ్ చెప్పిన ప్రకారమే పార్టీలో పనిచేస్తానన్నారు.

పుణ్యక్షేత్రాల యాత్రకు ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: పుణ్యక్షేత్రాలు, ఆలయాల సందర్శనకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు ప్యాకేజీలను ప్రకటించింది. మొదటిసారిగా అయోధ్య వంటి ప్రాంతాలను కూడా ఈ టూర్‌లో సందర్శించే అవకాశం కల్పిస్తోంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ పేరిట 13 స్లీపర్, 3–థర్డ్ ఏసీ, 1–సెకండ్ ఏసీ కోచ్‌లతో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్ర మోహన్ బిసా వెల్లడించారు. ఈ యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుంది. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో జూలై 26వ తేదీన బయలుదేరుతుంది. ఈ యాత్రకు వెళ్లాలనుకునే వారు పెందుర్తి, విజయనగరంలో ఈ రైలు ఎక్కాల్సి ఉంటుంది. అదే స్టేషన్‌లో తిరిగి దిగుతారు. పూరి, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన జగన్నాథ్ ఆలయం, సూర్యనారాయణ ఆలయం, పిండ ప్రదానం , విష్ణుపాదం ఆలయం, కాశీ విశ్వనాథ ఆలయం, విశాలాక్షి ఆలయం, అన్నపూర్ణదేవి ఆలయం, గంగా హారతి, రామ జన్మభూమి, హనుమాన్ గర్హి ఆలయం, త్రివేణి సంగమం , హనుమాన్ మందిర్, శంకర్ విమాన్ మండపం వంటి ప్రదేశాలను సందర్శించవచ్చు. ఒక్కొక్కరికి టికెట్, వసతి, రవాణా చార్జీలతో కలిపి ఎకానమీ 15,075, పిల్లలకు(5–11 సంవత్సరాల లోపు) 14,070, స్టాండర్డ్ 23,875, పిల్లలకు(5–11సంవత్సరాల లోపు) 22,695, కంఫర్ట్ 31,260, పిల్లలకు(5–11సంవత్సరాల లోపు) 29,845 (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)గా ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ఎకానమీ ప్రయాణికులకు నాన్ ఏసీ బడ్జెట్ హోటల్‌లో, నాన్ ఏసీ వాహనాల్లో తీసుకెళ్తారు. స్టాండర్డ్/కంఫర్ట్ ప్రయాణికులకు థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ రూంలలో వసతి కల్పిస్తారు. నాన్ ఏసీ/ఏసీ వాహనాల్లో తీసుకెళ్తారు. ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తారు. మరిన్ని వివరాలకు రైల్వేస్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో గానీ, చందన్‌కుమార్(82879 32318), ఎస్.విశాలాక్షి(97010 85461)ను గానీ సంప్రదించవచ్చు.